

గుర్నాథం టైపు చేస్తున్నాడు!

ఆఁ హాఁ! కొడుతున్నాడు. అదర గొడుతున్నాడు.

బాదేస్తున్నాడు.

వారం రోజుల్నించీ అదే వరస!

టైపుమిషనులో నుంచి కాగితాలు తీసి మళ్ళీ కాగితాలు ఎక్కిస్తున్నప్పుడల్లా నాలుగు పేటల దారంగల మాదిరి సుబ్బురి నోటికి ఒక పక్కనుంచి గుచ్చి మరో పక్కనుంచి పైకి లాగుతూ దిట్టంగా కుట్లు వేస్తున్నంత తృప్తి!

ఎడంచేత్తో హాండిల్ పుచ్చుకుని రోలర్‌ని కుడివైపు తోస్తున్నప్పుడల్లా, ఆమె కుడిచెవిని తన ఎడంచేత్తో మెలి పెడుతున్నంత తృప్తి!

తన రెండు చేతులకీ ఉన్న వేళ్ళన్నీ (ఎడమచేతి బొటనవేలు మినహాగా) ఉపయోగిస్తూ ఈ మాటా, ఆ మాటా (లేక ఈ మెట్టూ ఆ మెట్టూ, లేక ఈ కీ ఆ కీ) ఒకదానివెంట ఒకటి క్షణం తీరుపోకుండా, గబగబా నొక్కి పారేస్తూ ఉంటే— సుబ్బుర్ని పట్టుకుని ఆ చెంపా ఈ చెంపా వాయించి పారేస్తున్నంత తృప్తి!

ఇంత తృప్తి నిస్తోంది ఆ టైపు మిషన్ గుర్నాథానికి.

తనలో అనుక్షణం నిలవవుతున్న ఈ తృప్తి 'లీక్' అయిపోతుందేమో నన్న భయంచేత గట్టిగా పెదాలు బిగించి ఉంచాడు గుర్నాథం.

ప్రచండ భీకరత్వం తాండవిస్తోం దతని ముఖంలో.

తను కాబోతున్నది 'దగ్ధం' అని గ్రహించలేక అజ్ఞానంతో దీపశిఖమీద వాలే పురుగులా ఓ ఈగ వచ్చి తళతళా మెరుస్తున్న అతని ఫ్రెంచికట్ మీసంపై వాలింది.

అంతే! ఆ పెదాలు వదులయాయి!

ఆ విధంగా తన భీకరత్వం ధ్వంసం కావటం సహించలేకపోయాడు గుర్నాథం! నందికేశుడిలా బుస కొట్టాడు.

అంతే! ఆ పెనుగాలిలో ఎటో కొట్టుకు పోయింది ఆ అల్పజీవి, ఈగ! మళ్ళీ కనపడలేదు.

"రోగం కుదిరిందా? చచ్చావా? చావు! ఇంకా చావు! చచ్చి చచ్చి చావు! ఇదికూడా తీసుకు చావు! ఇదికూడా. . .!" గుర్నాథం ఇచ్చినవన్నీ తీసుకు చస్తోందా టైపుమిషను.

టపటప లాడుతూ ఛస్తోంది.

వారం రోజుల్నుంచీ "ఏదో పోనీలే" అని చూసీ చూడనట్లూరు కుంటూ వస్తున్న సహ గుమాస్తాలు ఈ వేళ గుర్నాథం చూపిస్తున్న ధాటికి బొత్తిగా తట్టుకోలేకపోయారు. అతను కురిపిస్తున్నది వీరాద్భుత భయానక బీభత్స రౌద్ర రసాల్లో ఏ జాతికి చెందిందో ఇదమిత్థంగా తేల్చుకోలేకపోయారు. ఎక్కడి వాను లక్కడ కళ్ళేసి తమ తమ కుర్చీల్లోంచి లేచి చేతులు కట్టుకుని పెదాలు విరుస్తూ "అయ్యో, పాపం!" అనే బాణీలో చూడ సాగారు.

నిమిషాలమీద నిశ్శబ్దం అలముకు పోయింది ఆఫీసంతా! గుర్నాథం చేత చిక్కిన అతని మొదటి భార్య (పెళ్ళికాక ముందు కొత్తగా ఉద్యోగంలో చేరిన రోజుల్లో "టైపురైటరు నా మొదటి భార్య" అని ఆఫీసులో అందరి ముందూ ఎలుగెత్తి చాటుకున్నాడు గుర్నాథం! ఆ సంగతి ఆ ఆఫీసులో అందరికీ ఇంకా జ్ఞాపకం ఉంది!) చేస్తున్న ఆర్తనాదం తప్ప మరేమీ వినిపించటం లేదు.

ఆ ఆఫీసులో ఒక మూలగా ఉన్న తన ఛేంబర్లో కూర్చుని తనకి రావలసి ఉన్న ప్రమోషనూ వగైరాల్నంటే వల్లకాదు కాదు, ఆపేసే అని నమ్మకం కుదుర్చుకున్నారు. అయినా ఎందుకైనా మంచిదని తను తొడుక్కున్న కోటు గుండీలన్నీ గట్టిగా బిగించేశారు.

కాస్త చలి తగ్గింది!

ఆలోచించటం మొదలెట్టారు.

మర్నైతే మిట్టమధ్యాహ్నంవేళ ఇంత హఠాత్తుగా వాతావరణం ఇలా మారి పోయి ఇంత చలెందుకు వేసింది?

ఓ పొడుగాటి పిన్ను ఏరి తీసుకుని చెవిలో తిప్పుకున్నారు. వెంటనే వెలి సొచ్చిం దాయన కసలు సంగతేమిటో!

మత్స్యవిక్రయశాలలా సదా సందడిగా ఉండే తన ఆఫీసు చచ్చిపోయినట్లుంది. అంతిమ ఘడియల్లో రోగి తలవద్ద ఉండే మానెదీపం రెపరెప కొట్టుకున్నట్లు తన ఆఫీసు ప్రాణం టపటపా కొట్టు కుంటూందల్లే ఉంది! ఆ శబ్దం తప్ప మరేమీ వినిపించటం లేదు.

అందుచేత ఎవరికీ తెలియకుండా తనే గమనించాలి. . .

గుర్నాథం వరస పెప్పుగంట నించీ ఒక్కలా చూస్తున్న ఓ సహగుమాస్తాకి హఠాత్తుగా దూరదృష్టి ఒచ్చింది!

తన ప్రథమ భార్యని అదే పనిగా వాయించి పారేస్తున్న గుర్నాథం కొద్ది క్షణాల్లో సొమ్మసిల్లిపోతాడనీ, ఇంక దేవుడు చల్లగా మేలు చేస్తే స్పృహ తప్పికూడా పోతాడనీ పసిగట్టా డతను.

వెంటనే ఓ తెల్లకాగితం తీసుకుని (టైపుమిషన్ బొత్తిగా ఖాళీ లేనందు వల్ల) స్వహస్తంతో ఓ అప్పీలు రాసి పేరు పేరునా అందరికీ చూపించి, నిశ్శబ్దంగా ఓ నాలుగు రూపాయల దాకా వసూలు చేసి, ప్యూనుచేత రెండు కేసుల గోల్డ్ సోడాకాయలు తెప్పించి రెడీగా ఉంచాడు.

ఇదేమీ గమనించకుండా దంచి పారేస్తున్నాడు గుర్నాథం.

ఓ కాగితాల బొత్తి లాగేసి మరో కాగితాంబొత్తి మిషన్‌లో కెక్కించేస్తున్నాడు.

రేకుల షెడ్‌మీద వాన కురుస్తున్నట్టు టపటపా మోత!

తెల్లటి కాగితాలన్నీ నల్లబడి పోతున్నాయి.

ట్రే నిండిపోతూంది. . .

ముహూర్తం దగ్గర పడుతూందన్నంత హడావుడిగా బాత్‌రూమ్‌లోకి పరుగెత్తి, ఓ బీడీ అంటించి రెండు దమ్ములాగి, విసిరి, బూట్‌కాలితో నేల రాసి, మళ్ళీ లోపలికి పరుగెత్తు కొచ్చాడు సోడాలు తెప్పించిన చంద్రావు.

పెద్ద పెద్ద విషయా లాలోచిస్తున్న మేనేజరు మార్కండేయులు గారికి ఉన్నట్టుండి వెన్నులో చలి ఆరంభమైంది. తన పరిసరాలన్నింటినీ ఓ సారి పరీక్షించు కున్నారు, తను ప్రస్తుతం ఉన్నది వల్లకాట్లో కాదుగదా అన్న అనుమానం నివృత్తి చేసుకోవడానికి.

తను కూర్చున్నది స్టీలుకుర్చీ! తన ముందున్నది స్టీలు టేబిల్! ఆ టేబిల్ మీద ఎర్రసిరా కలం, నల్లసిరా కలం, డైరీ, పిన్‌కుషన్, పేపర్లు, వాటిమీద పేపరువెయిట్లు, రెండు ఖాళీ ట్రేలు వగైరాలన్నీ ఉన్నాయి. ఎదురుగా గోడ గడియారం, దాని కటుపక్క శ్రీ వేంకటేశ్వర స్వామివారి కాలెండరూ, ఇటు పక్క గజలక్ష్మీదేవి కాలెండరూ, పైన సీలింగుఫానూ, కిటికీలో నీళ్ళకూజా, ఆ పక్కనే బోర్లించిన గ్లాసూ— ఇవన్నీ వల్లకాట్లో ఉండవు. గారంటీగా ఇది

మార్కండేయులుగారు తల పంకించారు.

గుర్నాథం తప్ప మరెవరూ పని చేస్తున్నట్లు లేదు! ఛ కాదు, అతగాడు తప్ప మరెవరూ ఆఫీసులో ఉన్నట్లేదు. ఉంటే ఈ పాటికి యథావిధిగా చేపల కంపు వేస్తూ ఉండవలసిందే గదా!

అందరూ పొలోమని రోడ్డుమీదికి పోయారా?

ఈ వేళ ప్రైమ్‌మినిస్టరో, ప్రెసిడెంటో ఈ ఊరు విజయం చెయ్య బోతున్నట్టెక్కడా పేపర్లో లేదే!

లేకపోతే రామారావో, నాగేశ్వర్రావో.

గంట మోగించి ప్యూన్‌ని పిలుద్దా మనుకున్నారు మార్కండేయులు గారు. కాని, తీరా పిలిచి అడిగితే వాడు మాత్రం నిజం చెబుతాడని నమ్మకం ఏమిటి? అసలే వాడు యూనియన్ మనిషి!

పి. శ్యామ

హార్మోనియందేముందీ కుతూహలం పెంచేస్నో తాయారై పిచ్చిలా అరిచేవారు.

గుర్నాథం ఎందరో విన్నపుడికి ఆఫీసో ఏంపిచ్చేచ్చే ఆయన కూడా అందు వచ్చ లేదు ఎప్పటంటూనే గుర్నాథ్నా రోపారి

పోనీ తలుపు తీసి చూదామా అను కున్నారు

ఏ! లాభం లేదు. అలా చేస్తే తనకే అప్రతిష్ఠ! తీరా తలుపు తీసి చూసిన తరవాత వాళ్లంతా ఆఫీసుకొస్తే—ఎంటే ఇంత నిశ్శబ్దంగా? తను అదృష్టవంతుడే! తన ప్రమోషన్ ఛాన్సు ఇంకా బలపడు తుంది! అంత పెద్ద స్టాఫుని ఇంత బాగా కంట్రోలు చేస్తున్నందుకు హెడ్మాస్టరు తనకి బ్రహ్మరథం పడు తుంది. ఎప్పుడో ఇద్దామనుకున్న ప్రమో షన్ వెంటనేగాని, ఇంకా వీలైతే నాలుగు నెల్ల క్రితం నుంచి (రెట్రాస్పెక్టివ్ ఎఫెక్టుతో) గాని ఇచ్చేస్తుంది. . . కానీ, తను ఊహించినట్టు వాళ్లెవరూ అక్కడ లేకపోతే, వచ్చిన తరవాత వాళ్లందర్నీ తను శిక్షించాలి. శిక్షించకపోతే రేపొద్దున్న గుర్నాథమే అడుగుతాడు ఎందుకని శిక్షించలేదండీ అని. అంతమందిని శిక్షించ టం సాధ్యమా? పైగా వాళ్లందరికీ ఓ యూనియన్ కూడా ఏడిచిందయ్యె! అమ్మో! ఇంకేమైనా ఉందా? అభాసు పాలైపోడూ తనూ? అందుచేత అది సరియైన పద్ధతి కాదు.

వెధవది, ఈ తలుపు కో రంధ్రమున్నా పెట్టించి చచ్చారుకారు కట్టించినవారు — అని విసుక్కున్నారు.

అయినా వెదకసాగారు రంధ్రాల కోసం.

గుర్నాథం స్పృహ తప్పి ఎప్పుడు పడిపోతాడా, తెప్పించిన సోడాలన్నీ కొట్టి ఎప్పు డతని మొహంమీద పోద్దామా అని ఊహా ఇద్దైపోతున్నాడు చంద్రావు.

టైపుమిషన్‌లోని రిబ్బను ఇటునుంచి అటూ, అటునుంచి ఇటూ పరుగెడు తూంది, పెళ్లైన కొత్తలో సుబ్బులు పుట్టింటినించి అత్తింటికీ, అత్తింటి నుంచి పుట్టింటికీ (పండగంకనీ, నోముల కనీ) పరుగెత్తినట్టు.

ఆ మిషన్‌లోని రోలరు కాగితాన్ని భుజానేసుకుని గిరగిరా తిరుగుతూంది, సుబ్బులు నీళ్లు తోడేటప్పుడు చేంతాడు భుజాన వేసుకుని తిరిగే బావిగిలకలా.

సుబ్బులు నీళ్ళు తోడుతుంటే చూడటం స్వతహాగా గుర్నాథానికి సరదా గానే ఉంటుంది.

పొట్టిగా గుమ్మటంలా ఉండి తాడు లాగినప్పుడల్లా ఎగిరెగిరి పడుతూ ఉంటుంది. కొత్తగా చూసేవాళ్లకి అసలా బకెట్ ఎగిరిపడేదా లేక దాని ఎరుపుకి సుబ్బులే పెళ్ళి గిరికెక్కి కూర్చుంటుందా అని అనుమానం వస్తుంది.

అంతేకాదు, సుబ్బులు నీళ్ళు తోడే టప్పుడు సంగీతం — అదే ఇంగ్లీషులో 'రిథిం' అంటారే అది—వినిపిస్తుంది. ఆమె చేతిగాజులు లయబద్ధంగా ఘల్— ఘల్— ఘల్— ఘల్ అంటాయి.

వారం రోజుల్నాడు— అలాగే గం గల్లాడుతూంటే గుర్నాథానికి వెంటనే ఓ పాట జ్ఞానకం వచ్చింది. ఆ పాటతో సుబ్బుల్ని ఉడికించాలనిపించింది.

**కొందరు కొన్ని పనులు చేయడానికే పుడతారు. అందరూ అన్ని పనులూ చేయలేరు. తెలిసిన పనిలో మెప్పు పొందడానికి చేసిన కృషి ఫలిస్తే కారణ జన్ముడిని అని గర్వపడతాడు మనిషి. గతంలోని తప్పులు వర్తమానాన్ని వెక్కిరించి నప్పుడు భవిష్యత్ కాల సర్పపు కాటున తప్పించు కోవడం సాధ్యమా?**

అర్జెంటుగా ఇంట్లోకి పరుగెత్తి, కొయ్యపెట్టె తెరిచి సుబ్బులికి వాళ్ల పుట్టింటి వారిచ్చిన సింగిల్ రీడ్ హార్మోనియమ్‌కి ఓ నవారుబద్దీ కట్టి మెళ్లో వేలాడేసుకుని దొడ్లో కొచ్చాడు— "చిటపట— చినుకులు— పడుతూ ఉంటే. . ." అని పాడుకుంటూ.

అయితే సుబ్బులు కాస్త కూడా ఉడుక్కోలేదు.

నూతి అంచుదాకా తోడిన నీళ్ల బకెట్ దభీమని నూతిలోకి వదిలేసి, రెండు చేతులూ నడుంమీద బిగించి పకపకా నవ్వింది.

గుర్నాథానికి చాలా ఆశాభంగం కలి గింది.

ఆ తరవాత కోపం వచ్చింది.

పైకి మాత్రం "సుబ్బెంత నవ్వినా ఉపయోగం తెలుసుకోదే ఎందిరే! హా హ్హ!" అన్నాడు.

ఇంకా విరగబడి నవ్వింది సుబ్బులు.

ఈ సారి కోపం దాచుకోలేకపోయాడు గుర్నాథం.

"ఎందుకలా ఇకిలిస్తావ్, ఠ తపళ్ల ఎక్కలేస్!" అన్నాడు.

అతి కష్టంమీద నవ్వాపుకుంది సుబ్బులు.

ఆ పైన "అంత పెద్ద హార్మణీ మెడలో తగిలించుకుని ఉత్తి నోటిపాట పాడతారేం? వాయించకుండా?" అంది.

తన లోపం అప్పటిగ్గాని అర్థం కాలేదు గుర్నాథానికి.

పోనీ వాయించేదామా అనుకున్నాడు.

మరి తను ఇంతవరకూ ఎన్నుడూ హార్మోనియమ్ వాయించలేదే!

రెండు చేతులతో టైపు చెయ్యటం తెలిసిన తనకి, ఒంటిచేత్తో హార్మోనియమ్ వాయించాలంటే పెద్ద కష్టమేం కాదు గానీ, ఏ అక్షరానికి ఏ మెట్టు నొక్కాలో కాస్త తెలుసుకోవా లంతే! ఆ ఒక్క కిటుకు తెలుసుకుంటే ఇహ ఆ తరవాత ఎన్ని పాటలైనా ఊదవతల పారెయ్యొచ్చు!

పెళ్లయి నాలుగేళ్లయినా ఇంకా ఆ కిటుకు తెలుసుకోకుండా అశ్రద్ధ చేసి ఊరుకున్నందుకు తనని తనే నిందించు కున్నాడు.

ఓ పాడుబుద్ధి! మట్టిబుద్ధి! తెలిసీ తెలిసీ అజ్ఞానంలో పడటమంటే ఇదే కాబోలు. . . తనూ టైపు నేర్చు కున్నాడు. మొదట్లో అదేదో చాలా కష్టమైన బ్రహ్మవిద్య అనుకునేవాడు. ఆర్నెల్లు నేర్చుకున్న తరవాత తిరిగి చూసుకుంటే ఏముంది? నిమిషానికి పాతిక మాటలు కొట్టేసే ప్రజ్ఞ వచ్చేసింది. లోయరు పాసయ్యాడు. మరుసటేడు హయ్యరు పాసయ్యాడు. ఇప్పు డేది కావా లంటే అది కళ్ళు మూసుకుని టైపు చెయ్యగలడు.

అయితే, టైపుమిషనులో ఏది నొక్కితే ఏ అక్షరం పడుతుందో చక్కగా తాటికాయంత అక్షరాలతో రాసి ఉంటుంది. టైపు నేర్చుకోనివాడుకూడా కాస్త కష్టపడి మెల్లిగా టైపు కొట్టె య్యొచ్చు!

మరి హార్మోనియమ్‌లో ఆ సౌకర్యం బొత్తిగా లేదే!

ఇంతటి అధ్వాన్నమైన వాద్యాన్ని కని పెట్టినవాణ్ణి కసిదీరా తిట్టుకున్నాడు. మెటికలు విరిచాడు. ఇంకా కోపం పట్ట లేక— 'అందుకే దీనికి "ఆకాశవాణి"లో స్థానం లేకుండా పోయిందనుకున్నాడు. మాజాగా అయిందని చంకలు కొట్టు కున్నాడు.

"వాయించమంటే అలా చంకలు కొట్టుకుంటారేమండీ?" అంది సుబ్బులు సాగదీస్తూ.

ఘాటుగా ఏదో అనబోయాడు గుర్నాథం.

పక్కింటి పిన్నిగారు నీళ్లకోసం బావి దగ్గరి కొచ్చారు.

చప్పున ఇంట్లోకి పారిపోయొచ్చాడు గుర్నాథం.

మెడకి తగిలించిన హార్మోనియమ్ తీసి పట్టెమంచం మీద పెట్టాడు.

'పెద్ద సమస్యగా తయారైందే, ఎలాగా?' అనుకున్నాడు. రెండు చేతులతో జుత్తు పీక్కున్నాడు. మళ్లీ తల దువ్వు కున్నాడు.

అటూ ఇటూ పచార్లు చేస్తూ ఎడమచేతి చిటికెన వేలి గోటితో దంతాల మధ్యన ఇరుక్కున్న ఆవకాయపీచు (పొద్దుటిది) లాగి అవతల పారేశాడు.

వెంటనే జ్ఞానోదయమైంది!

ఎలా?

తనలో నుంచొక బుల్లిగుర్నాథం బయటకొచ్చి, భుజం తట్టి, "ప్రయ త్నిస్తే మానవుడి కసాధ్యమైం దేదీ లేదోయ్, గుర్నాథం!" అన్నాడు.

"అలాగా?" అన్నాడు గుర్నాథం ఆశ్చర్యపోతూ.

"అలాగే!" అని బుల్లి గుర్నాథం లోపలి కెళ్లిపోయి గడియ వేసేసుకున్నాడు.

ఒక్క గెంతులో పట్టెమంచంమీది కెళ్లిపోయాడు గుర్నాథం. ఛాసెం పట్టు వేసుక్కూర్చుని, హార్మోనియమ్ పెట్టెని ముందుకి లాక్కున్నాడు. ఎడంచెయ్యి దాని తిత్తిమీద వేసి ఓ సారి తల పైకెత్తి దూలం కమ్ములకేసి చూస్తూ ఆలోచించటం మొదలెట్టాడు.

ఆంధ్రభాష కక్షరము లెన్ని?

ఏభై ఆరని జ్ఞాపకం.

అంటే ఈ హార్మోనియమ్‌లో చిన్నా పెద్దా, నలుపూ తెలుపూ—అన్నీ కలిసి ఏభై ఆరు మెట్లు ఉండాలన్నమాట!

ఉన్నాయా?

ఒకటీ, రెండూ, మూడూ, నాలుగూ . . . నంభై!

ఇంతేనా?

ఈ డొక్కమీద ఎవరో డోలు వాయించినట్లు "ఢాం" అని వినిపిం చింది.

అంటే ఈ హార్మోనియమ్ చేసిన వాడెక్కడో ఎప్పుడో కాలు వేశాడన్న మాట!

అసలు అచ్చులకీ, హల్లులకీ ఈ మెట్లు సరిపోకపోతే ఇంకా గుణింతాల కెక్కడ సరిపోతుంది?

బహుశః ఒకటి కావచ్చు. చివరి పదహారక్షరాలూ— (అంటే "వ"మంచి "క్ష" వరకూ గల అక్షరాలు) పాటలో ఉంటే ఆ పాట వాయించటానికి ఈ హార్మోనియమ్ పనికిరాదన్నమాట! పైగా గుణింతాలున్నాకూడా పనికిరాదన్న మాట.

అయితే "చిటపట చినుకులు పడుతూ ఉంటే. . ." అని వాయించా లంటే అందులో ఉన్న వన్నీ "ప"లు, గుణింతాలేవయ్యో! ఇహ మిగిలిందేమిటటా? ఇక్కడో "ట", అక్కడో "ట"!


అలా అయితే చెదలు తినేసినట్టుంటుం దా పాట!

"నాన్సెన్స్! పిచ్చి సుబ్బుల్ని పాపం, వాళ్ల పుట్టింటివాళ్లు మోసం చేశారు. ఛ! ఈ రోజుల్లో ఎవర్నీ నమ్మకూడ దమకో!" తనకి తెలీకుండానే బయట కనేశా డీ మాటల్ని.

"ఎవర్నండీ నమ్మకూడందీ?" అంటూ లోపలి కొచ్చింది సుబ్బులు.

"ఇంకెవర్నీ? మీ పుట్టింటివార్ని! ఈ హార్మోణీని వాళ్లెక్కణ్ణుంచి తెచ్చారు, చెప్పు! దాయకుండా చెప్పాలి!"

"ఏం? మా ఊళ్లో అండాళమ్మ గారని ఓ సంగీతం మేష్టారున్నారండీ! ఆవిడ దగ్గర. . ."



"మరింకేం! అలా చెప్పు! అరవ్వాళ్లకి అన్నీ కలిపి మొత్తం ముప్ఫయ్యేనిమిదో, ముప్ఫయితొమ్మిదో నేటగా అక్షరాలూ? అందుకే వాళ్లకి సరిపోయిందీ హార్మణీ! తెలుగువాళ్లం మన కెలా సరిపోతుందీ?"

"ఏమిటి మీ రనేది?"

"కాదూ కూడదంటే ఇంగ్లీషు వాళ్ల క్కూడా సరిపోతుంది, లేషుగ్గా! వాళ్ల కిరవై యార్రేగా అక్షరాలూ? పైగా గుణింతాలు బొత్తిగా లేవయ్యె."

"మీ రంటున్న దేమిటో ఒక్క మాటకూడా బోధపట్టంలా నాకు!"

"వదరు, వదరు! ఇదుగో, విను! ఈ హార్మణీమీద 'చిటపట చినుకులు' పాట వాయించటం బ్రహ్మతరంకూడా కాదు. ఏమంటావ్?"

పొట్ట చేత పట్టుకుని పెళ్లున నవ్వింది సుబ్బులు.

"అలా నవ్వకు! నీ మంచికే చెబుతున్నా! రేప్పొద్దక్కి మీ ఊ రెళ్లినప్పుడు ఈ హార్మణీ ఇచ్చేసి మంచిని యాభై యార్రు మెట్ల హార్మణీ తెచ్చుకో! చక్కగా అన్ని పాటలూ వాయించుకోవచ్చు!"

సుబ్బులి నవ్వాగలేదు.

రక్తారుణంగా చూశాడు గుర్నాథం.

ఎలాగో నవ్వాపుకుంది సుబ్బులు.

ఆపుకుని, "మీ క్కావలసింది చిటపట చినుకులేనా? నే వాయించి చూపిస్తా ఇటివ్వండి!" అని హార్మోనియమ్ దగ్గరకు లాక్కుని గడగడా వాయించి చూపించింది సుబ్బులు.

అదోలా చూశాడు గుర్నాథం.

అది చిటపట చినుకుల్లాగే వినిపించినా, నిజానికి చిటపట చినుకులు మాత్రం కాదు. అదే బాణీలో ఉన్న మరేదో పాట అని అతని అనుమానం.

ఆ మాటే సుబ్బులుతో అన్నాడు కూడా.

"పోనీ ఏ పాటైతే ఏం? అదే బాణీమీద వినిపించిందా లేదా?" అంది సుబ్బులు.

"అదుగో, నువ్వే ఒప్పుకుంటున్నావు చూశావా? అది చిటపట చినుకులు మాత్రం చచ్చినా కాదు. నాకు తెలుసు. మీ పుట్టింటిమీద అభిమానంకొద్దీ ఏదో 'బాణీ—ఓణీ' అంటూ సరిపెడదామని చూస్తున్నావు?" అన్నాడు గుర్నాథం ఓరకంటితో చూస్తూ.

"మరైతే అదేం పాట? మీరే చెప్పండి!" అంది సుబ్బులు.

"అది నా కెలా తెలుస్తుంది? వాయించినదానివి నీకు తెలియాలి!"

"సరే. మీ ఇష్టమొచ్చినట్టనుకోండి! నా దేం పోయింది?" అంటూ పోబోయింది సుబ్బులు.

"ఆగు! కూర్చో!" గదమాయించాడు గుర్నాథం.

కూర్చుంది సుబ్బులు.

"మళ్లీ వాయించు!"

వాయించింది సుబ్బులు—

పాటని మనసులో అనుకుంటూ సుబ్బులు వాయిస్తున్నదాన్ని దానితో కొలిచి చూశాడు. పొడుగు సరిగ్గా సరిపోతూంది.

అయితే సూక్ష్మదృష్టిగల అతని కళ్లు ఓ గొప్ప రహస్యాన్ని కనిపెట్టి ఫొటో తీసి చూపించాయి గుర్నాథానికి. "చిటపట చినుకు" ఈ అక్షరాలన్నింటికీ ఒకే మెట్టు ఏడు సార్లు నొక్కుతూంది సుబ్బులు.

"నన్నే మోసం చేదామని చూస్తున్నావుగా!" అన్నాడు గుర్నాథం.

తెల్లబోయింది సుబ్బులు.

"వేర్వేరు అక్షరాలకి ఒకే మెట్టు నొక్కుతావేం?"

"నన్నేం చెయ్యమన్నారు? అవన్నీ ఒకే స్వరంలో ఉన్నాయి మరి!"

"నువ్వు పదమూడో మెట్టుమీదే చిటపటలన్నీ వాయిస్తున్నా వంటే, ఆ ఆ ఇ ఈ లొస్తే అవన్నీ ఎక్కడ వాయిస్తావ్? వాటన్నిటికీ మెట్లేవీ?" అన్నాడు గుర్నాథం, 'ఇప్పు డెక్కడికి పోతా' వన్నట్టు మొహం పెట్టి.

వెంటనే మంచం దిగింది సుబ్బులు. గుర్నాథాన్ని ఎగాదిగా చూసిం దోసారి. అర్థమైందన్నట్టు మొహం పెట్టి, "ఇదేం టైపుమిష ననుకున్నారా—ఒక మెట్టు ఒక అక్షరమే పలకటానికి? ఇది సంగీతం! ఇది హార్మణీ. ఒక్కొక్క మెట్టు ఒక్కొక్క స్వరం పలుకుతుంది. అక్షరాలతో దీనికి సంబంధం లేదు. ఏ పాటనైనా, ఎక్కడైనా వాయించవచ్చు. మీ చిటపట చినుకులు ఈ చివరి మెట్లమీద వాయించమంటారా? వినండి!. . . ఈ మధ్య మెట్లమీద వాయించమంటారా? చిత్తగించండి. . . ఈ మొదట్లో వాయించమంటారా? ఊఁ కానీండి. . ."

ఆ ఒక్క పాటనీ ఆ హార్మోనియమ్‌లో అరడజను చోట్ల వాయించి వినిపించింది సుబ్బులు. ఒక్కొక్కచోట వాయిస్తుంటే తనని ఒక్కొక్క రంపంతో కోస్తున్నట్లనిపించింది గుర్నాథానికి.

కాని, అన్నిటికంటె అత న్నెక్కువగా బాధించింది సుబ్బులు వాడిన డయలాగులు — 'ఇదేం టైపుమిష ననుకున్నారా ఒక మెట్టు ఒక అక్షరమే పలకటానికి? ఇది సంగీతం! ఇది హార్మణీ! ఒక్కొక్క మెట్టు ఒక్కొక్క స్వరం పలుకుతుంది! అక్షరాలతో దీనికి సంబంధం లేదు.

మంచీ మర్యాదా లేకుండా, కట్టుకున్న భర్త అనైనా లేకుండా ఎంత మొహాన కొట్టినట్టు మాటాడింది? పయోముఖ విషకుంభం! గోముఖ వ్యాఘ్రం! ఛీ ఛీ! అసలు దీన్ని పెళ్లాట్టమే తప్పు!

తన పోషణలో ఉంటూ, తన ఉప్పు తింటూ, వేలెడుందో లేదో — తననీ, తన టైపురైటర్నీ ఎలా అవమానించేసిందీ? హుఁ! టైపుమిషను గొప్ప దానికేం తెలుసు? హార్మోనియమ్‌లో ఏ మెట్టుకీ నీతి నిలకడా లేదు. ఎప్పుడు ఏం పలుకుతుందో తెలియదు. కాని, టైపురైటర్లో ప్రతి మెట్టుకీ ఒక నీతి ఉన్నది. ఒక మెట్టుని ఎప్పుడు నొక్కినా ఒక అక్షరమే పడుతుంది.

'అయినా దీని వాగుడుతో నాకు పనేమిటి? హార్మణీ వాయిస్తే గొప్పకాదు! వాయించిన పాట ఎంత గొప్పదైనా ఇట్టే గాలి కెగిరి చక్కాపోతుంది. టైపు చేసిన కాగితం అలా కాదు. జాగ్రత్తగా దాచుకుంటే ఎంత కాలమైనా ఉంటుంది. టకటకా స్పీడుగా టైపు చేస్తే అందులోనూ సంగీతం వినిపిస్తుంది తప్పులు, తుడుపులు, కొట్టివేతలు లేకుండా టైపు చేస్తే అందంగా చిత్రలేఖనంకంటే బాగుంటుంది. రేపట్నుంచీ అదే నా ధ్యేయం, అదే సాధ్యేయం!'

అలా అనుకుంటూ అన్నం తినకుండా పడుకున్నా డా రాత్రి గుర్నాథం.

సుబ్బులు వచ్చి ఎంతగానో బ్రతిమాలింది. అయినా వినలేదు, తినలేదు.

"నా మీద కోపం వచ్చిందా?" అంది సుబ్బులు.

"నీ మీద నా కెందు క్కోపం?" అన్నాడు గుర్నాథం.

"పోనీ ఇవాల్టినుంచి హార్మణీ వాయించటం మానేస్తాలెండి!"

"ఎందుకు మానెయ్యటం? వాయించుకో! కాని, దానిమీద వద్దు. అది మార్చి ఏభై యార్రు మెట్లు. . ." మాట మధ్యలోనే మింగేసి, "ఏం లేదులే" అంటూ అటు తిరిగి పడుకున్నాడు.

ఈ దృశ్యం అనుక్షణం గుర్నాథం బుర్రలో మెదులుతూ, అతని టైపింగ్ స్పీడు వృద్ధి కావటానికి తోడ్పడుతూంది.

మేనేజరు మార్కండేయులుగారు రంధ్రాన్వేషణలో కృతకృత్యులు కాలేకపోయారు. మళ్లీ ఆలోచనలో పడ్డారు.

ఆఫీసులో ఉన్న గుమాస్తాలందరూ కట్టగట్టుకుని బయటికి పోతే గుర్నాథం ఒక్కడు మాత్రం టైపు చేసుకుంటూ కూర్చున్నా డన్న మాట! అంత మందిలో కనీసం ఒక్కడికైనా తనంటే భయం ఉన్నందుకు తనని తనే అభినందించుకున్నారు.

అవునూ! గుర్నాథంకూడా గుమాస్తాల యూనియన్‌లో సభ్యుడేనని జ్ఞాపకం. మరయితే అత నొక్కడే తనంటే ఎందుకు భయపడుతున్నాడు?

"మీ రీ మధ్యన అతన్ని తల వాచేట్టుగా వాట్లు వేశారుగా!" అని వినిపించింది.

అదిరిపడ్డారు మార్కండేయులు గారు.

ఆకాశవాణి కాబోలనుకున్నారు.

నివృత్తి కోసం—"ఎవరది?" అని గద్దించారు.

"చిత్తం! నేను! మీ అంతరాత్మని!"

"నే నెప్పుడూ గుర్నాథాన్ని చీవాట్లు వెయ్యలేదే!"

"వేశారు, ఈ మధ్య జాకొబ్‌గా రొచ్చినప్పుడు. జ్ఞాపకం తెచ్చుకోండి . . ."

అవును! ఆ రోజు బొంబాయి నుంచి జనరల్ మేనేజరు జాకొబ్ వచ్చాడు. రాగానే ఫలానా సంగతి తెలియజేస్తూ హెడ్డాఫీసుకు ఒక లెటరు టైపుచేసి తీసుకురమ్మన్నాడు గుర్నాథాన్ని. టైపు చేసి లోపలికి పంపించాడు గుర్నాథం. ఆ ఉత్తరాన్ని ఎడంచేత్తో అందుకుని, బారెడు దూరంగా పట్టుకుని, కళ్లజోడు, హియరింగ్ ఎయిడ్ ఒకసారి సర్దుకుని, "హూ ఈజ్ దిస్ ఎక్స్ టైపిస్ట్?" అన్నాడు సీరియస్‌గా.

సంగతేమిటో అర్థంకాని మార్కండేయులుగారు తెల్లమొహం వేసి, మళ్లీ అంతలోనే అలాంటి మొహం వెయ్యటం తప్పని గ్రహించి, దాని కో

తన హృదయంలోనికి
న్యాయంగా చూడగలవాడు,
తా నక్కడ చూచినదానిని
వ్రాస్తే-ఇక అతనికి పాఠకుల
కరవు ఉండనే ఉండదు.

—ఎడ్ హోవే

వెకిలినవ్వు అడ్డం వెయ్యాలని ప్రయత్నించారు.

"సీ దిస్ లెటర్!" అని ఆ కాగితాన్ని మార్కండేయులుగారి చేతి కిచ్చాడు జాకొబ్.

చూస్తే ఏముంది? ప్రతి పంక్తిలోనూ కనీసం రెండు మాటలైనా "ఎక్స్"లతో కొట్టి వేయబడి ఉన్నాయి.

"ఎక్స్‌క్యూజ్ మి, సర్" అని ఆ లెటర్ చేత పుచ్చుకుని, ఛేంబరు తలుపు తెరుచుకుని బయటికొచ్చారు మార్కండేయులుగారు.

సరాసరి గుర్నాథం దగ్గరి కెళ్ళి, "ఈ ఎక్స్‌లన్నీ ఏమిటయ్యా, గుర్నాథం, అసహ్యంగా వికారం పుట్టుకొచ్చేట్టూ? ఆఁ? జనరల్ మేనేజరుగా రేమన్నాడో తెలుసా? ఎవరీ ఎక్స్ టైపిస్టు అన్నాడు!" అన్నాడు.

"చిన్నచిన్న స్పెల్లింగుతప్పులొస్తేనూ సరిచేశానండీ!" అన్నాడు గుర్నాథం, కాస్త నొచ్చుకుంటూ.

"చిన్న చిన్న తప్పులైతే సరి చెయ్యక పోయినా ఫర్వాలేదయ్యా? గబగబా చదివేటప్పుడు స్పెల్లింగూ అదీ సరిగా ఉందా లేదా అని ఎవరు చూడొచ్చారూ? లెటరు టైపు చేస్తే ఎలా ఉండాలి? అందంగా ముద్దొచ్చేట్టుండద్దూ? చూడగానే సంతకం చెయ్య బుద్ధవద్దూ? భలే వాడివే! చాల్లాల్లే! మళ్ళీ జాగ్రత్తగా టైపు చేసి పంపించు. నీటుగా, అందంగా ఉండాలి, తెలిసిందా? ఊఁ, కానీ!"

అంతా కళ్ళముందు మెదిలింది మార్కండేయులుగారికి.

'నే పెట్టినవి చీవాట్లా?' అని ఆశ్చర్యపోయారు మార్కండేయులు గారు.

"అవును, చీవాట్లే!" అని ఘోషించింది అంతరాత్మ.

"ఛ నీ!"అని చెంపలు కొట్టుకున్నారు మార్కండేయులుగారు.

అయితే తను పెట్టిన చీవాట్ల ప్రభావం అన్న మాట ఇదంతా!

ఈమధ్య గుర్నాథం అద్భుతంగా టైపు చేసేస్తున్నాడు. రోజూ ఏళ్ళై కాగితాలు కొట్టి అవతల పారేస్తున్నాడు. ప్రతి లెటరూ, స్టేట్‌మెంటూ నీటుగా ఫొటో తీసిన ట్టుంటూంది. తను ఇలా సంతకం చేసి అలా తోసి పారేస్తున్నాడు. పనులన్నీ చకచకా తెమిలిపోతున్నాయి. బోలెడంత పెండింగ్ క్లియరై పోతూంది.

ఇన్ని జరుగుతుంటే హెడ్డాఫీసు చూస్తూ ఊరుకుంటుందా?

చస్తే ఊరుకోదు!

వెంటనే ప్రమోషన్ ఇచ్చేస్తుంది తనకి. వద్దన్నా తీసుకొచ్చి అంటగడుతుంది.

అన లిపాటికి అర్డరు వచ్చేస్తూ ఉండమ్ము.

అయితే తను స్వార్థపరుడు కాదు. ఏ గుర్నాథం సహకారం లేకపోతే ఇదంతా సాధ్యమయ్యేది కాదో, ఆ గుర్నాథాన్ని వృద్ధిలోకి తీసుకురావటం తన కర్తవ్య మనీ తనకు తెలుసు. ఈ కర్తవ్యం నెరవేరే ఏర్పాటుకూడా ఇదివరకే చేసి ఉంచాడు తను. ఈ సంగతి గుర్నాథానికి ఇంకా తెలియదు. తెలిస్తే అర్జెంటుగా తనకు సాష్టాంగపడిపోతాడు.

ఒక కంట్లో ఓ చిన్న ఆనందబాష్పం ఉబికింది మార్కండేయులుగారికి. భరించలేక తుడిచేసుకున్నారు. మరో కన్ను అదిరింది. "ఆహాఁ" అనుకున్నారు. పొంగిపోయారు.

మరుక్షణంలో అనుమానం వచ్చింది, 'అదిరింది ఏ కన్నూ? ఆనందబాష్పం కురిపించిందే కన్నా?' అని.


చప్పున జ్ఞాపకం రాలేదు.

కాసేపాలోచించి, ఇహ ఆలోచించలేక, అదిరింది కుడికన్నే అయి ఉంటుందిలే అనుకున్నారు.

కాకపోతే, తనకు ప్రమోషన్ రాబోతుంటే ఎడంకన్ను ఎలా అదురుతుంది?

ఆలోచనలో పడిపోయి అసలు సంగతి మరిచిపోతున్నట్టు గ్రహించారు.

# మార్గదర్శులు




## మొదటి గుండె మార్పిడి

మొదటిసారిగా గుండె మార్పిడి చేసినవారు డాక్టర్ క్రిష్టియన్ బెర్నార్డ్. ఆయన దక్షిణాఫ్రికా సర్జన్. కేప్‌టౌన్‌లోని గ్రూటెషూర్ ఆసుపత్రిలో ఇది జరిగింది.

లూయీ వాష్ కెన్‌స్కీ అనే టోకు వర్తకుడు (56 ఏళ్ళు) గుండె జబ్బుతో చావు బతుకుల్లో ఉన్నాడు. మంచి గుండె ఏమో ఒక బాటు ప్రమాదంలో తల పగిలిపోయిన 25 ఏళ్ల డెనిస్ డార్వెల్‌ది. అతను చనిపోగానే ఆ గుండెను ఇతనికి అమర్చాలి గనుక శస్త్ర చికిత్స అతివేగంగా జరుగవలసి వచ్చింది. ఎన్నెన్నో మందులు ఇచ్చారు. శస్త్ర చికిత్స పూర్తి అయింది.

ఆరో రోజు రోగి ఎంతో బాగున్నాడు కానీ మరొక అయిదు రోజులకు అతని శ్వాసకోశంలో జబ్బు ఆరంభమైంది. అందులో శస్త్ర చికిత్స తర్వాత 18 రోజులకు ఆ రోగి చనిపోయాడు.

ఆఖరు క్షణం దాకా కొత్తగా అమర్చిన గుండెకాయ చక్కగా పనిచేస్తూనే ఉంది.

జాగ్నా ఏం జరుగుతూందోనని ఆలకిం చారు.

పరిస్థితి ఏం మారినట్టు లేదు.

ఇవాళకూడానే అంతా ప్రశాంతంగా ఉంది. గుర్నాథం టైపుమిషను చేస్తున్న ఖటఖట శబ్దం తప్పితే మరేం వినపట్టం లేదు.

సరే! కొద్దైతే అదే అవుతుందని తలుపు తెరవబోయారు.

టైపు శబ్దం హఠాత్తుగా ఆగి పోయింది.

తలుపు తెరవటం మానేసి భ్రుకుటి ముడివేశారు మార్కండేయులుగారు. ఆలకించసాగారు.

టైపుమిషనులోని కాగితాలు ఫ్రరున లాగేసి, వాటి మధ్యనున్న కార్బను పేపర్లు తీసి పక్కన పడేసి, ఓ గుండుసూది తీసుకుని చేతిలోని కాగితాలకి గుచ్చుతూ కుర్చీలోంచి లేచాడు గుర్నాథం.

ఇంతసేపూ అతన్నే కనిపెట్టి చూస్తున్న గుమాస్తాలందరూ ఈ విహంగాన్ని పరిణామాని కాశ్చర్యపోయారు. ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. ఎవరి మొహంలో చూసినా నిరాశే!

"అలా లేచి నుంచున్నాడేం, మేకల్లే? స్ప్రుహతప్పిపోతా డనరూ?" అని గొణి గారు, వచ్చే ఏడు రిటైరు కాబోతున్న ఓ సోమయాజులుగారు.

అందరి కళ్లూ సోడాలు తెప్పించిన చంద్రాలవుకేసి తిరిగాయి. ఒకరిద్దరు అతన్ని మోచేతులతో పొడుస్తూ ఏదో గొణిగారు. పచ్చి వెలక్కాయ గొంతుకలో పడ్డట్టయిం దతనికి.

మిడిగుడ్లు వేసుకుని అటూ ఇటూ చూడసాగాడు చంద్రాలావు.

మోచేతి పో ట్లెక్కువయ్యాయి. 'ఇహ తప్పదుగావున్నురా దేముడా' అనుకుంటూ భయంగా గుర్నాథంవేపు నడిచా డతను.

గుర్నాథం అతన్ని గమనించకుండా తను టైపు చేసిన కాగితాల మొత్తం లెక్కేస్తున్నాడు.

చంద్రాలావు ధైర్యం చిక్కబట్టుకుని, "మీరు స్ప్రుహతప్పి ...పోతారని. . ." అన్నాడు. ఆ తరవాత నోరు పెగల్లేదు.

"... పోతానని ఎవరు చెప్పారు మీకూ?" గద్దించాడు గుర్నాథం, అతని కళ్లలోకి సూటిగా చూస్తూ.


కంగారు పడిపోయి రెండడుగులు వెనక్కేశాడు చంద్రాలావు. మళ్లీ మరి కాస్త ధైర్యం తెచ్చుకుని, "మీ కోసం రెండు డజన్ల సోడాకాయలు తెప్పించాం చందాలేసుకుని! మంచి పవరున్న కాయలు" అన్నాడు.

అవునన్నట్టు చూశా రందరూ.

పవర్‌ఫుల్‌గా ఓ డైలాగు చెప్పాలనిపిం చింది గుర్నాథానికి.

"నేను కాదంటున్నట్లే! టైపు చెయ్యటం కోసమే పుట్టాను. కాస్తకీ కూస్తకీ మీ రనుకున్నట్టు స్ప్రుహ తప్పి పోయేవాణ్ణి కాను. ఇన్నాళ్లుగా అలక్ష్యం చెయ్యబడుతున్న టైపిస్టు అనే ఉద్యోగికి ఒక గౌరవస్థానం ఇప్పించటమే నా ధ్యేయం! తెలిసిందా? ఈ పవర్‌ఫుల్ డైలాగుని మీ పవరున్న కాయలతో కంబోసుకుని తలో గుక్కెడూ పుచ్చు కోండి! బాగుపడతారు!" అని తను టైపు చేసిన కాగితాలన్నీ కట్టగట్టి పుచ్చుకుని మేనేజరు మార్కండేయుల వారి సన్నిధికి చేరాడు. అతనివెనకే ఛేంబరు తలుపు దబ్బున మూసుకుంది.

నెత్తిమీద పెద్ద బరువు దించేసి నట్లయింది మార్కండేయులవారికి.



బట్టతలమీద పేరుకున్న చెమటలంతా జేబురుమాలుతో తుడుచుకుంటూ ఉత్సాహంతో కూడిన చిరునవ్వుతో మెల్లిగా— "రావోయ్! రా, రా! కూర్చో! అందరూ ఇక్కడే ఉన్నారల్లే ఉందే! ఎక్కడికైనా తిరణాల కెళ్లిపోయారేమో అనుకున్నా" అన్నారు.

హఠాత్తుగా తిరణాల గోల వినపడ సాగింది. కేకలు, ఈలలు, గుద్దులు. . .

"ఒకటి కాదు, రెండు కాదు, రెండు డజన్ల సోడాలా?"

"ఇంకా రూపా యర్థైపైన లేం జేశాక్?"

"తన్నండి. . . కొట్టండి. జేబులో వేసుకున్నాడల్లే ఉంది. తొరగా దొరికితే. . ."

"రంగయ్యా! కొట్టు!. క్కుంయ్!. . . క్కుంయ్!"

మార్కండేయులుగారు కంగారుపడ సాగారు. మళ్లీ డిసిప్లిన్ తగలడి పోతూం దీ ఆఫీసులో అని వాపోయారు.

"అయినా, ఆ క్కుంయ్ క్కుంయ్ లేమిటోయ్?" అని వాకబు చేశారు.

"సోడాలండీ! తలో గుక్కెడూ పుచ్చు కుంటున్నారల్లే ఉంది" అన్నాడు గుర్నాథం.

"ఏమిటీ! సోడాయే! హౌ గాడ్! హౌ గాడ్, వ్హాట్ కెనై డూ?(పుసీకాట్ పుసీ కాట్ బాణీలో అన్నారు ) ఎంత బరితెగిం చేశారోయ్?"

"అబ్బే! సోడా కాదులెండి. వట్టి సోడాలే!"

"అంతేగదా! పోనీ, రక్షించావ్! ఏదో చావనీలే! మన కెందుకు! ఆఁ, అన్నీ టైపు చేశావల్లే ఉందే! వెరీ గుడ్! నీ కో శుభవార్త చెప్పనా? మన ఆఫీసులో పని ఎక్కువైపోతే ఇంకో టైపిస్టుని అదనంగా వేసుకోమన్నారు కదూ, మన హెడ్డాఫీసువారు! అందుకు నేనే మన్నానో తెలుసా? ఇంకో టైపిస్టుని అదనంగా వేసేబదులు ఉన్న ఉన్న టైపిస్టుకే మరో రెండు ఇంక్రిమెం ట్లివ్వచ్చు. అత నీ మధ్యన అద్భుతంగా టైపు చేసేస్తున్నాడూ అన్నాను. అలా అని ఈమధ్య నా ద్రోజుల్నా దే హెడ్డాఫీసుకు పెర్సనల్‌గా, కాన్ఫిడెన్షల్‌గా రాశాములే! ఈవేళో రేపో వచ్చేసంటూ ఆర్డరు రావచ్చు!" చిరునవ్వుతో అన్నారు మార్కండేయులుగారు.

నోరి గంతేశాడు గుర్నాథం.

"ఆఁ నిజంగానా, సార్! మీకు మెనీ మెనీ థాంక్స్, సార్! నా సంతోషం నాకు రెండింక్రిమెంట్లివ్వన్నా యనే కాదు. టైపిస్టు అనేవాడికి తగు గౌరవం దక్కుతోందని!" కసిగా అన్నాడు, తన భార్య సుబ్బులక్ష్మిని తలుచుకుంటూ.

కసి తగ్గిన తరవాత "మీకు దేముడు మేలు చేస్తాడు, సార్!" అనికూడా అన్నాడు.

"నా కెలాగూ ప్రమోషన్ రాబోతోం దనుకుంటాలే" అన్నారు మార్కండేయులుగారు, కుర్చీలో సర్దుకుని వెనక్కి వాలుతూ.

"పోస్ట్!" అంటూ తలుపు తోసుకుని లోపలి కొచ్చాడు పోస్ట్‌మన్.

మార్కండేయులుగారి మొహం చేటంతయింది.

గుర్నాథం మొహం చిన్నబోయినంతయింది.

అది రిజిస్టర్డ్ లెటర్. సంతకం చేసి మార్కండేయులుగారే అందుకుని చించారు. చదివారు.

శివరక్షణ కోల్పోయిన భావం వారి మొహంలో చిందింది.

గుర్నాథం గుండె కొట్టుకోనా, వద్దా అని మథనపడసాగింది.

ఉత్తరాన్ని గుర్నాథం చేతి కిచ్చారు మార్కండేయులుగారు.

అది జనరల్ మేనేజరు జాకొబ్ మార్కండేయులవారికి పెర్సనల్‌గా వ్రాసిన లేఖ.

"ప్రియమైన శ్రీమార్కండేయులూ!

ఇటీవలి కాలంలో మీ ఆఫీసుకు సంబంధించిన ఏ వ్యవహారమూ సరిగా జరగటం లేదని నా కర్థమవుతూంది. మీ ఆఫీసులో అందరికీ— మీతో సహా— అశ్రద్ధ బలిసి పోయిందని తెలుస్తూంది. ఇందుకు ఋజువుగా మీ ఆఫీసునుంచి నాకు ఈవేళే అందిన ఒక ఉత్తరం జతపరిచి పంపుతున్నాను. అందులో మొట్టమొదట 'డియర్ సర్' (ప్రియమైన అయ్యా ) కు బదులుగా 'డెఫ్ సర్' ( చెవిటి అయ్యా ) అని టైపు చెయ్యబడి ఉంది. మీ టైపిస్టు ఒళ్లు తెలియక అలా టైపుచేస్తే కళ్లు మూసుకుని మీ రెలా సంతకం చేశారో అర్థం కాకుండా ఉంది.

ఏది ఏమైనా నేను దీన్ని మీ రిద్దరూ చేరి బుద్ధిపూర్వకంగా నాకు చేసిన అవమానంగా భావించుకుంటున్నాను. తత్ఫలితంగా మీ ఇద్దరికీ చెరి రెండు ఇంక్రిమెంట్లూ కోసివేస్తున్నాను.

ఈ ఉత్తరం అందిన వెంటనే అలా అందినట్లు తిరుగు టపాలో తెలియపరచ గలరు.

ఇట్లు

జాకొబ్

జనరల్ మేనేజరు." ✱